

కాల్వ పనులు అడ్డగింత

నెట్టెంపాడు 99వ ప్యాకేజీలోని డీ–4 కాల్వ పనులను రైతులు అడ్డుకున్నారు.

వివరాలు 8లో ▸



ట్రంప్ విధానాలపై..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలపై ప్రధాని మోదీ స్పందించాలని జాన్‌వెస్లీ అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 33.7 /21.3

వాతావరణం

పొద్దస్తమానం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరుతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ

కొల్లాపూర్: పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ప్రవేశాల కోసం ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన మైనార్టీ బాలికలు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నిరూప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులలో అడ్మిషన్లు స్వీకరిస్తారన్నారు. ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని, వాటిలో 30 సీట్లు మైనార్టీ విద్యార్థినులకు, 10 సీట్లు నాన్ మైనార్టీ విద్యార్థినులకు కేటాయించామన్నారు. మైనార్టీ విద్యార్థినులకు స్పాట్ అడ్మిషన్లు ఇస్తామని, పూర్తి వివరాల కోసం సెల్ నంబర్లు 79950 57922, 73825 32129 లకు ఫోన్ చేయాలని సూచించారు.

కంటిచూపుపై జాగ్రత్తలు పాటించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: ప్రతిఒక్కరు కంటి చూపుపై జాగ్రత్తలు పాటిస్తూ ప్రతి ఆరు నెలలకోసారి పరీక్షలు చేయించుకోవాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ బాలాజీ అన్నారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక కంటి చికిత్స శిబిరంలో 155 మందిని పరీక్షించగా 51 మందికి కంటిపొర, క్యాటరక్ట్ ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్స నిమిత్తం ప్రత్యేక అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్‌కు పంపించామన్నారు. ప్రతి ఒక్కరు కంటి చూపులో ఏదైనా సమస్య తలెత్తితే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులకు చూయించుకోవాలన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉన్న అందరికీ ఉచితంగా కంటి ఆపరేషన్ చేసి.. అవసరమైన అద్దాలు, మందులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి వెంకటస్వామి, సుకుమార్‌రెడ్డి, డీపీఎంఓ శ్రీను, ఎంపీహెచ్ఈఓ కల్యాణ్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రకాష్, డాటా ఎంట్రీ ఆపరేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నీరు పారేదెలా..?!

ఆధునికీకరణకు నోచుకోని కేఎల్‌ఐ కాల్వలు



ఎల్లూరు సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలో పేరుకుపోయిన జమ్ముగడ్డి

- పేరుకుపోయిన జమ్ముగడ్డి, ముళ్లపొదలు
- సాగునీరు ముందుకు పారకుండా అడ్డంకులు
- వర్షాకాలంలో కోతకు గురవుతున్న వైనం
- సిమెంట్ లైనింగ్ చేయాలని రైతుల వేడుకోలు

కేఎల్‌ఐ పరిధిలో రిజర్వాయర్లు 3	ఆయకట్టు విస్తీర్ణం 3.40 లక్షల ఎకరాలు
సాగునీటి కాల్వలు 324 కి.మీ.,	సింగోటం కాల్వ లైనింగ్ కోసం మంజూరు చేసిన నిధులు రూ.10 కోట్లు

కొల్లాపూర్: జిల్లాలోని లక్షలాది ఎకరాలకు సాగునీరందించే కేఎల్‌ఐ ప్రాజెక్టు కాల్వలు ఆధునికీకరణకు నోచుకోవడం లేదు. ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా ప్రారంభమై దశాబ్దకాలం పైగా కావొస్తున్నా ఇప్పటి వరకు కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగానే సాగుతోంది. కాల్వల్లో పిచ్చిమొక్కలు, జమ్ముగడ్డి, ముళ్లపొదలు ఏపుగా పెరిగి సాగునీరు ముందుకు పారడం లేదు. ఫలితంగా వర్షాకాలంలో కాల్వలు కోతకు గురై.. రైతులు సాగు చేసిన పంటలను ముంచెత్తి.. తీవ్రంగా నష్టపరుస్తున్నాయి.

రైతులు చందాలు వేసుకొని..

కేఎల్‌ఐ ప్రాజెక్టు కింద ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లు ఉన్నాయి. ఎల్లూరు రిజర్వాయర్ కింద 70 వేల ఎకరాలు, జొన్నలబొగుడ రిజర్వాయర్ కింద 90 వేలు, గుడిపల్లి గట్టు రిజర్వాయర్ కింద 1.80 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా.. ఆయా భూములకు సాగునీరు అందించేందుకోసం 324 కి.మీ., మేరకు కాల్వలు తవ్వారు. అయితే వీటికి ఎక్కడా సిమెంట్ లైనింగ్ లేకపోవడంతో జమ్ముగడ్డి, ముళ్లపొదలు ఏపుగా పెరుగుతున్నాయి. అయితే కొంతమంది రైతులు చందాలు వేసుకొని కాల్వల్లో ఉన్న జమ్ముగడ్డి, ముళ్లపొదలను తొలగించుకుంటున్నారు. తర్వాత కొందరు ప్రజాప్రతినిధులు సైతం చేయూతనందించారు. అయితే వీటికి రూ.లక్షలు ఖర్చు అవుతుండటంతో నాలుగేళ్ల క్రితం ఈజీఎస్‌లో చేర్చారు. కానీ కాల్వల శుభ్రత పనులు మాత్రం ఎక్కడా జరగడం లేదు.

ఎల్లూరు– సింగోటం మధ్యలో మాత్రమే..

ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్ల ద్వారా సాగునీటిని విడుదల చేసే డిస్ట్రిబ్యూటరీల వద్ద కొంత మేరకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేశారు. మిగతా ప్రాంతాల్లో ఎక్కడా సిమెంట్ లైనింగ్ లేదు. ఏడేళ్ల క్రితం ఎల్లూరు రిజర్వాయర్ నుంచి సింగోటం రిజర్వాయర్ వరకు మెయిన్ కెనాల్‌కు సిమెంట్ లైనింగ్ చేసేందుకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు కొంత మేరకు చేపట్టి వదిలేశారు. మిగతా కాల్వలకు సీసీ లైనింగ్ చేసేందుకు నిధుల కేటాయింపు జరగలేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

సాగునీటి కాల్వల్లో జమ్ముగడ్డి, ముళ్లపొదల తొలగింపు, నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు కేటాయింపులు లేవు. ఈజీఎస్ ద్వారా జమ్ము, ముళ్లపొదలు తొలగించే పనులు చేపట్టాలని గతంలో నిర్ణయించారు. కొన్నిచోట్ల ఆ పనులు జరిగాయి. సిమెంట్ లైనింగ్ నిర్మాణాల గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ

సొంత డబ్బులు వెచ్చించి..



ఎల్లూరు రిజర్వాయర్ నుంచి కొల్లాపూర్ మీదుగా రామాపురం వరకు ఉన్న డీ–1 కాల్వలో జమ్ముగడ్డి, ముళ్లచెట్లు పెరిగాయి. ఏటా ఒక ప్రజాప్రతినిధి సొంత డబ్బులతో మొక్కలు తొలగిస్తున్నారు. లేకపోతే రైతులమే స్వయంగా పనులు చేయించుకుంటున్నాం. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కాల్వలకు సిమెంట్ లైనింగ్ చేయాలి.

– ఆంజనేయులుగౌడ్, రైతు, రామాపురం, కొల్లాపూర్ మండలం

తాత్కాలిక మరమ్మతులే..

ఏటా వర్షాకాలంలో కాల్వల్లో నీళ్లు నిండుకుని జమ్ముగడ్డి, ముళ్లపొదల కారణంగా కోతలకు గురవుతున్నాయి. కొల్లాపూర్ పరిధిలోని ఎత్తం, వరిదేల, చౌటబెట్ల, నాగర్‌కర్నూల్ పరిధిలోని తుమ్మలసూగూరు, భల్లాన్‌పల్లి, వట్టెం, చర్లఇటిక్యాల, మారేపల్లి, కల్వకుర్తి పరిధిలోని బండోనిపల్లి, కుర్మిద్ద శివార్లలో కేఎల్‌ఐ కాల్వలు తరుచుగా గండ్లు పడి కోతకు గురవడంతో వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారు. అయితే సంబంధిత అధికారులు వాటికి తాత్కాలిక మరమ్మతు చేపట్టిన చేతులు దులుపుకొన్నారు.



వెల్దండ మండలం గుండాల సమీపంలో తెగిన కేఎల్‌ఐ కాల్వ (ఫైల్)

భూ సేకరణ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్, పక్కన అదనపు కలెక్టర్ అమరేందర్

నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు– రంగారెడ్డి, మార్కండేయ, ఎంజీకేఎల్‌ఐ ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిపోయిన భూ సేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ప్రాజెక్టుల భూ సేకరణలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో అదనపు కలెక్టర్ అమరేందర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులపై ఎప్పటికప్పుడు సీఎం సమీక్షిస్తున్నారని, అందుకు అనుగుణంగానే రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేసి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యంత మొదటి ప్రాధాన్యతగా భూసేకరణ పనులు జూన్ 6 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ నుంచి వచ్చిన ప్రతిపాదనలను రెండ్రోజుల్లోనే పూర్తి చేయాలని సర్వే ల్యాండ్ అధికారికి సూచించారు. మార్కండేయ ఎత్తిపోతల పథకం కింద గంగారం, శాయిన్‌పల్లి గ్రామంలో వెంటనే సర్వే పూర్తి చేయాలన్నారు. కేఎల్‌ఐలో భాగంగా ప్యాకేజీ–28, 29, 30లో తాడూరు, తెలకపల్లి, కల్వకుర్తి, వంగూరు, వెల్దండ, అచ్చంపేట మండలాల్లోని ఆయా గ్రామాల వారీగా చివరి దశలో ఉన్న సేకరించాల్సిన భూముల వివరాలు ప్రస్తుత స్థాయిలను అవసరమైన చర్యలపై సమీక్షించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణ, నీటి పారుదల శాఖ అధికారులు సత్యనారాయణరెడ్డి, పార్థసారథి, మురళి, జిల్లా సర్వే ల్యాండ్ అధికారి నాగేందర్, ఆర్డీఓలు మాధవి, సురేష్, భూ సేకరణ విభాగం కలెక్టరేట్ సూపరింటెండెంట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి రెవెన్యూ సదస్సులు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో భూ భారతి చట్టంపై రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నిర్వహించిన వీసీలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, వచ్చే భూ సమస్యల దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించాలని సూచించారు. ఏ గ్రామంలో ఎప్పుడు ఏ సమయానికి ఎక్కడ నిర్వహిస్తున్నారో ప్రజలకు స్పష్టంగా తెలిసేలా ముందస్తుగా గ్రామాల వారిగా టాంటాం వేయించాలని సూచించారు. రెవెన్యూ సదస్సులో వచ్చే దరఖాస్తులు అన్నింటినీ ఆగస్టు 15లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

6 నుంచి బడిబాట కార్యక్రమం

జిల్లాలో వచ్చే నెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించి.. బడిబయట ఉన్న పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో డీఈఓ రమేష్‌కుమార్, సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు, సీడీపీలతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, స్వయం సహాయక బృందాలు కలిసి ఇంటింటికీ వెళ్లి విద్య ప్రాముఖ్యతను వివరించాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచడం, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడమే బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

పకడ్బందీగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

రాష్ట్ర అవతరణ దినోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జూన్ 2న జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో జరగబోయే రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవతరణ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. వివిధ వర్గాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలన్నారు.

జూరాలకు వరదొచ్చింది



పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడుతున్న జూరాల ప్రాజెక్టు



18 ఏళ్ల తర్వాత మే నెలలోనే ప్రవాహం

- 99 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 12 గేట్లు ఎత్తివేత
- అర్ధరాత్రి 11 యూనిట్లలో విద్యుదుత్పత్తి ప్రారంభం

గద్వాల/ధరూరు/ఆత్మకూర్: కృష్ణా బేసిన్‌లో ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్ణాటకలో వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోంది. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు కేవలం 3,624 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం మధ్యాహ్నం నుంచి క్రమంగా వరద పెరిగింది. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. భీమా ప్రాజెక్టు నుంచి దాదాపు లక్ష క్యూసెక్కులు విడుదల చేశారని పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ఈ సీజన్‌లో తొలిసారి జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తారు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో ప్రాజెక్టుకు 99 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 12 గేట్లను ఎత్తి 83,616 వేల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేశారు. ఇదిలా ఉండగా.. చివరిసారిగా 2007లో మే నెలలోనే జూరాల ప్రాజెక్టుకు వరద వచ్చిందని, మళ్లీ 18 ఏళ్ల తర్వాత ఈ నెలలో వరద రావడం ఇదే మొదటిసారి అని అధికారులు చెబుతున్నారు. 40 ఏళ్ల ప్రాజెక్టు చరిత్రలో మే నెలలో వరద రావడం ఇది ఐదోసారి మాత్రమే. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం జలశయంలో 8.571 టీఎంసీల నీరు ఉంది.

⇨ జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమై లిఫ్టు–1 గుడ్డెందొడ్డి వద్ద రెండు పంపులను ప్రారంభించి 1,500 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసి.. గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్లను నింపుతున్నారు. జూలై మూడో వారంలో ప్రారంభం కావాల్సిన వరద ముందు రావడంతో.. అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుదుత్పత్తి ప్రారంభం

కాగా.. గురువారం అర్ధరాత్రి ఎగువ, దిగువ జల విద్యుత్‌కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. ఎస్‌ఈ శ్రీధర్ బృందం ప్రత్యేక పూజలను నిర్వహించి విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. అనంతరం జన్కో ఉద్యోగులు మిఠాయిలు పంపిణీ చేశారు. ఎగువలో ఐదు యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో ఆరు యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తిని విజయవంతంగా చేపట్టారు. గతేడాది జూలై 17న రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి ప్రారంభం కాగా.. 49 రోజుల ముందే ప్రారంభం కావడంతో 610 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

జూరాల ప్రాజెక్టుకు వరద వస్తున్న నేపథ్యంలో దిగువనున్న లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపల వేట కోసం మత్స్యకారులు నదిలోకి వెళ్లవద్దని జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ హెచ్చరించారు. సాగునీటి పారుదల శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తూ అందుకనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఫిట్‌లెస్ బస్సులు

ఈ నెల 16 నుంచి మొదలైన ప్రైవేట్ బస్సుల సామర్థ్య పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో 1,383 బస్సులకు గాను 245 పూర్తి
- కండీషన్‌లో లేని వాహనాలు వెనక్కి పంపాలని నిర్ణయం
- ఫిట్‌నెస్ పరీక్షలకు రాకుండానే నడిపిస్తున్న వైనం
- విద్యార్థుల సంరక్షణ బాధ్యత యాజమాన్యాలదే

పాలమూరు: ప్రస్తుత విద్యా సంవత్సరం పునఃప్రారంభానికి సమయం దగ్గర పడుతోంది. ఈలోగా విద్యార్థుల రవాణాకు ఉపయోగించే ప్రైవేట్ స్కూల్ బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి.. ఆర్టీఏ అధికారుల నుంచి సర్టిఫికెట్ పొందాలి. ప్రతి సంవత్సరం మే 15 వరకు బడి బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు ముగుస్తోంది. 16వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యే వరకు యాజమాన్యాలు తమ బస్సులకు ఆర్టీఏ అధికారుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయాల్లో పరీక్షలు కొనసాగుతున్న యాజమాన్యాలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే ఆర్టీఏ అధికారులు సంబంధిత వారితో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన సైతం కల్పించారు. అయితే గత విద్యా సంవత్సరం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించకుండానే కొన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు బస్సులు అలాగే నడిపారు. ఈసారైనా అధికారులు కఠినంగా వ్యవహరిస్తేనే పూర్తిస్థాయిలో పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో 1,383 బస్సులు ఉండగా.. ఇందులో మంగళవారం వరకు 245 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోగా ఇంకా 1,138 బస్సులు పరీక్షలు చేసుకోవాల్సి ఉంది.

కఠినంగా వ్యవహరిస్తేనే..

ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ విషయంలో కొందరు అధికారులు ఉదాసీనంగా, ఏజెంట్లు చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2024– 25లో దాదాపు వందకు పైగా బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోకుండానే విద్యార్థులను తరలించినట్లు తెలుస్తోంది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అర్హత పత్రాలు తీసుకోవాల్సిన కొందరు యాజమాన్యాలు మరమ్మతు ఇతర కారణాలతో ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవడం లేదు. విద్యాసంస్థల బస్సులన్నీ నిబంధనల మేరకు వసతులు కల్పించి ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోవాలి. బస్సుల నిర్వహణకు సంబంధించి విద్యార్థుల పూర్తి సంరక్షణ బాధ్యత తమదేనంటూ పాఠశాల యాజమాన్యాలు రవాణా శాఖకు హామీపత్రం సమర్పించాలి.





మహబూబ్‌నగర్ ఆర్టీఏ కార్యాలయానికి వచ్చిన బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

కచ్చితంగా ఉండాల్సినవి..

- ప్రతి స్కూల్ బస్సులో అవసరమైన మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స పెట్టె ఉండాలి.
- బస్సులో తప్పకుండా యూనిఫాం ధరించిన ఒక అటెండర్‌ను ఉంచాలి. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల పూర్తి వివరాలు, విద్యార్థి ఎక్కాల్సిన, దిగాల్సిన ప్రదేశాలు నమోదు చేయాలి.
- బస్సులో ఉన్న విద్యార్థులు కిందకు దిగే సమయంలో డ్రైవర్‌కి వారు కనిపించేలా మిర్రర్ ఏర్పాటు చేయాలి.
- ముఖ్యంగా బస్సు ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో తప్పనిసరిగా అగ్నిమాపక పరికరం ఉండాలి.
- బస్సులో సీట్ల కింద విద్యార్థుల బ్యాగులు పెట్టుకునేందుకు గాను ర్యాక్ ఏర్పాటు చేయాలి.
- బస్సు పాఠశాల కమిటీ పేరు మీద రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. తయారీ సంవత్సరం నుంచి 15 ఏళ్లు మించరాదు.
- ప్రతి బస్సుకు చేతి బ్రేకు, పూర్తిస్థాయిలో బీమా, రవాణా పన్నులు చెల్లించి ఉండాలి.
- బస్సు అద్దాలకు అనుకుని అడ్డంగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలి.
- నాణ్యమైన ఇంజిన్, స్టీరింగ్, రూఫ్, టైర్లు తదితర ప్రభుత్వం గుర్తించిన పూర్తి సౌకర్యాలు కల్పించాలి.
- విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా తక్కువ ఎత్తులో సీట్లు బిగించాలి.

సీజ్ చేస్తాం..



ఉమ్మడి జిల్లాలో ఈ నెల 16 నుంచి ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నాం. ప్రతి ప్రైవేట్ స్కూల్ బస్సులు పాఠశాలల ప్రారంభం నాటికి పరీక్షలు పూర్తిచేసుకోవాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రోడ్లపై తిరుగుతూ విద్యార్థులను తరలిస్తే అలాంటి బస్సులను కచ్చితంగా సీజ్ చేస్తాం. ప్రతి బస్సులో విద్యార్థుల వివరాలతోపాటు డ్రైవర్, క్లీనర్ వివరాలు తప్పక ఉంచాలి. సీట్ల సంఖ్యకు మించి విద్యార్థులను తరలించినా, పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించకపోయినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– కిషన్, ఉమ్మడి జిల్లా డీటీసీ

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా..

జిల్లా	మొత్తం బస్సులు	ఫిట్‌నెస్ అయినవి	పెండింగ్‌లో ఉన్నవి
మహబూబ్‌నగర్	472	97	375
నాగర్‌కర్నూల్	273	33	240
జోగుళాంబ గద్వాల	244	31	213
వనపర్తి	242	50	192
నారాయణపేట	152	34	118

నిబంధనలు ఏం చెబుతున్నాయి

ఏడాదిన్నర క్రితం 185వ చట్టం క్లాజ్(ఎఫ్) తర్వాత క్లాజ్ (జీ) ప్రకారం విద్యాసంస్థల బస్సుల కోసం అదనపు నిబంధనలు జోడించారు. విద్యాసంస్థల బస్సులకు ప్రభుత్వం ప్రత్యేకంగా పసుపు రంగుగుర్తు కేటాయించింది. స్కూల్ బస్సుపై కళాశాల/ పాఠశాల పేరు, ఫోన్, సెల్ నంబర్‌తోపాటు పూర్తి చిరునామా బస్సు ఎడమ వైపు, ముందు భాగంలో స్పష్టంగా కనిపించేలా రాయాలి..

- 60 ఏళ్లు దాటిన వ్యక్తిని డ్రైవర్‌గా నియమించుకోరాదు. పాఠశాల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్, బస్సుకు చెందిన పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.
- బస్సులో ఒక అత్యవసర ద్వారం ఉండాలి. దానిపై పెద్ద అక్షరాలతో అత్యవసర ద్వారం అని రాయాలి.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


గొల్ల రాజేందర్ (ఫైల్)

మరికల్: అనుమానాస్పందంగా వ్యక్తి మృతి చెందిన ఘటన మరికల్‌లో చోటుచేసుకుంది. గొల్ల రాజేందర్ (32) పట్టణంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. భార్య పెద్ద కుమారుడితో కలిసి తల్లిదండ్రుల వద్దకు వెళ్లగా రాజేందర్, చిన్న కుమారుడు బుధవారం రాత్రి భోజనం చేసి పడుకున్నారు. గురువారం ఉదయం తండ్రి నిద్ర లేవకపోవడంతో కుమారుడు ఏడవడం మొదలుపెట్టాడు. దీంతో పక్కింటి వారు గమనించి మృతుడి తల్లికి సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి చూడగా అప్పటికే మృతి చెందినట్లు తేలడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లి ముత్యాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ పైనుంచి దూకి డ్రైవర్ దుర్మరణం


మంగ సాయిబాబు (ఫైల్)

కల్వకుర్తి రూరల్: ట్రాక్టర్ పైనుంచి కిందకి దూకి డ్రైవర్ దుర్మరణం చెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మండలంలోని తురకలపల్లి గ్రామానికి చెందిన మంగ సాయిబాబు(23) ట్రాక్టర్‌తో తన పొలం దున్ని, వేరే రైతుల పొలం దున్నడానికి వెళ్తుండగా బ్రేకు వేసే క్రమంలో ట్రాక్టర్ ఒకవైపు వంగింది. దీంతో వెంటనే సాయిబాబు ట్రాక్టర్ మీద నుంచి కిందికి దూకడంతో తల వెనుక భాగంలో బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి సంవత్సరం క్రితమే వివాహమైంది. ప్రస్తుతం భార్య మమత మూడు నెలల గర్భవతి. తండ్రి బుచ్చయ్య, తల్లి లక్ష్మమ్మ ఉన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఎర్రవల్లి: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం మేరకు.. ఓ గుర్తు తెలియని వ్యక్తి (45) ఈ నెల 26న జాతీయ రహదారిపై కొండేరు స్టేజీ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా, కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతనికి తీవ్రగాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం అతడిని గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆ వ్యక్తి మృతదేహాన్ని గద్వాల మార్చురీలో ఉంచారు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు అలంపూర్ సీఐ 8712670286 లేదా ఇటిక్యాల ఎస్‌ఐ 8712670282 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

బిజినేపల్లి: మండలంలోని కొట్టాల్‌గడ్డ సమీపంలో బుధవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన భరత్‌కుమార్(31) మృతి చెందగా, కొట్టాల్‌గడ్డ గ్రామానికి చెందిన వినోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాలెంలో పాలు విక్రయించి బైక్‌పై వినోద్ తిరుగు ప్రయాణం అయ్యాడు. నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామం వద్ద మెగా కంపెనీలో పని చేస్తున్న భరత్‌కుమార్ వ్యక్తిగత పనిపై బిజినేపల్లికి బైక్ వెళ్తున్నాడు. స్థానిక కోళ్లఫారం వద్ద ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భరత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వినోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాధితుడిని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

గోడ కూలి ఆరు మేకలు మృతి



మరికల్: వర్షానికి తడిసిన మట్టి గోడ కూలి ఆరు మేకలు మృతి చెందిన ఘటన మరికల్‌లో గురువారం జరిగింది. తిర్మలయ్య తాను పెంచుకుంటున్న ఆరు మేకలను ఇంటి పక్కన కట్టేశాడు. రాత్రి కురిసిన భారీ వర్షానికి మట్టి గోడ కూలి మేకలపై పడటంతో మేకలన్నీ అక్కడికక్కడే మరణించాయి. మరణించిన మేకల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆర్‌ఐ సుధాకార్‌రెడ్డితో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వపరంగా బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు ఆర్‌ఐకి విన్నవించారు.

విద్యుదుత్పత్తి లక్ష్యం 610 ఎం.యూ.



- జూరాల ఎగువ, దిగువ కేంద్రాల్లో ప్రారంభమైన విద్యుదుత్పత్తి
- ఎగువ నుంచి భారీగా ఇన్‌ఫ్లో
- అర్ధరాత్రి నుంచి 11 యూనిట్లలో ఉత్పత్తి
- లక్ష్యం సాధిస్తామన్న అధికారులు

2014-15 నుంచి 2024-25 వరకు విద్యుదుత్పత్తి ఇలా (ఎం.యూ.)లలో..

సంవత్సరం	ఎగువ	దిగువ
2014-15	225	-
2015-16	316	45
2016-17	213	177
2017-18	217	206
2018-19	166	154
2019-20	301	305
2020-21	370	405
2021-22	335	369
2022-23	450	426
2023-24	101	111
2024-25	345	333

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. గురువారం సాయంత్రం నాటికి ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో అర్ధరాత్రి నుంచి ఎగువ, దిగువ కేంద్రాల్లో 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి ప్రారంభించారు. ఈ ఏడాది లక్ష్యానికి అనుగుణంగా విద్యుదుత్పత్తి చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అయితే ముందుగానే నైరుతి రుతుపవనాల రాకతో కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఎగువ నుంచి జూరాలకు వరద ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తికి సంబంధిత అధికారులు సర్వం సిద్ధం చేశారు. గతేడాది జూరాలకు వరద పుష్కలంగా రావడంతో 600 ఎం.యూ. లక్ష్యానికి మించి 678 ఎం.యూ. విద్యుదుత్పత్తి చేపట్టారు. 2022–23లో వరద పెద్ద ఎత్తున రావడంతో 640 ఎం.యూ. లక్ష్యానికి గాను 876 ఎం.యూ. విద్యుదుద్పత్తి చేపట్టి ప్రాజెక్టు చరిత్రలోనే రికార్డు సృష్టించారు. 2020–21లో 648 ఎం.యూ.కు గాను 775 ఎం.యూ., 2021–22లో 724 ఎం.యూ.కు గాను 704 ఎం.యూ. విద్యుదుత్పత్తి సాధించారు.

వరద నీరే ఆధారం..

ఎగువన ఉన్న మహారాష్ట్రలో వర్షాలు సమృద్ధిగా కురిసి.. కర్ణాటకలోని నారాయణపూర్, ఆల్మట్టి డ్యాంలు నిండిన తర్వాత ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద చేరుతోంది. వరద సమృద్ధిగా వస్తేనే ఇక్కడ లక్ష్యం మేరకు విద్యుదుత్పత్తికి ఆస్కారం ఉంటుంది. ఈ ఏడాది ముందుగానే ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుండటంతో జూరాలకు భారీగా వరద చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నా రు. ఎగువ నుంచి వరద భారీగా వస్తేనే విద్యుదుత్పత్తి వేగంగా కొనసాగించేందుకు దోహదపడుతుంది.



దిగువ జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం

మూడో యూనిట్‌లో సాంకేతిక లోపం..


దిగువ పవర్ హౌజ్

ఎగువ జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లకుగాను మూడో యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. రెండేళ్లుగా చైనాకు చెందిన సాంకేతిక నిపుణులు మరమ్మతు చేపడుతున్నారు. ఈ ఏడాది జూన్ చివరి నాటికి సాంకేతిక సమస్య తీరి మూడో యూనిట్ వినియోగంలోకి రానుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎగువలో ఐదు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తికి సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

■ ఈ ఏడాది దిగువ కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి గాను 290 ఎం.యూ. విద్యుదుత్పత్తి సాధించాలని లక్ష్యంగా ఉంది. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి గాను 320 మి.యూ. లక్ష్యంగా నిర్దేశించారు. కాగా, 2014–15 నుంచి 2024–25 వరకు ఎగువలో 3,039 ఎం.యూ., దిగువలో 2,531 ఎం.యూ.తో కలిపి మొత్తం 5,570 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టారు.

అందరి సహకారంతో ముందుకు..



అందరి సహకారంతో జూరాల జలవిద్యుత్ ప్రాజెక్టు ద్వారా లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. 12 యూనిట్లకు గాను 11 యూనిట్లను సిద్ధం చేశాం. ఎగువలో మూడవ యూనిట్‌లో నెలకొన్న సాంకేతిక సమస్య నెల లోపు తీరనుంది. గతేడాది ఆశించిన స్థాయిలో వరద రావడంతో లక్ష్యానికి మించి విద్యుదుత్పత్తి చేపట్టాం. ఈఏడాది 610 ఎంయూ టార్గెట్ ఉండగా.. అంతకు మించి ఉత్పత్తి చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

– శ్రీధర్, ఎస్‌ఈ, జన్‌కో

ట్రంప్ విధానాలపై మోదీ స్పందించాలి


విలేకర్లతో మాట్లాడుతున్నసీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

- ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి సంబంధించిన పలు అంశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మౌనం వహిస్తుండటం సరికాదన్నారు. ఐఫోన్లపై అమెరికాలో 20శాతం పన్నులు వేస్తున్నారని.. అమెరికాలోనే ఐఫోన్లు తయారు చేయాలని ఆంక్షలు విధించారని.. అమెరికా ఎగుమతి చేసే వస్తువులపై జీరో శాతం పన్నులు ఉండాలని ట్రంప్ ఆదేశిస్తున్నారన్నారు. దేశ ఆంతరంగిక వ్యవహారాల్లో ట్రంప్ జోక్యం పెరిగిపోయిందని ధ్వజమెత్తారు. వీటన్నింటిపై దేశ ప్రజలకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పహల్గాం ఘటనలో చనిపోయిన 26 మంది అమాయకులకు న్యాయం జరగలేదని.. ఉగ్రవాదులను నేటికీ పట్టుకోలేదన్నారు. భారత్, పాకిస్తాన్ యుద్ధం విషయమై పార్లమెంట్ సమావేశాలు జరిపి ప్రజలకు వాస్తవాలు వివరించాలన్నారు. మావోయిస్టులను మట్టుపెట్టేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశ పౌరులను చంపే హక్కు ఎవరికీ లేదన్నారు. దేశంలోని అంతరంగిక సమస్యలను పరిష్కరించడంలో మోదీకి చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. ఉపాధిహామీ కూలీల బడ్జెట్ రూ. 2.50లక్షల కోట్లకు పెంచాలన్నారు. ఈ నెల 30న కలెక్టరేట్‌ల వద్ద జరిగే వ్యవసాయ కూలీల ధర్నాకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధరలు కల్పించాలని, సబ్సిడీలు ఇవ్వాలన్నారు. ఒక్క శాతం మందితో 40 శాతం సంపద ప్రోగై కార్పొరేట్ల దేశంగా మారుతుందన్నారు. బీజేపీ విధానాలతో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయన్నారు. జిల్లాకు ట్రిపుల్ ఐటీ కళాశాల రావడం ఆహ్వానించదగ్గ విషయమని ప్రశంసించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

■ సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్ మాట్లాడుతూ.. పంటలకు మద్దతు ధర కేవలం రూ.69 పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.7,500 ఇస్తామని ప్రకటించి.. రైతులను మోసం చేసిందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి రాములు, నాయకులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, వి.పద్మ పాల్గొన్నారు.

మహిళ మృతి.. ప్రైవేటు ఆస్పత్రి సీజ్


ఆస్పత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

గండేడ్: వైద్యం వికటించి మహిళ మృతి చెందిన ఆరోపణల నేపథ్యంలో జిల్లా వైద్యశాఖ అధికారులు మండలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిని సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గండేడ్ మండల పరిధిలోని గోవింద్‌పల్లికి చెందిన లక్ష్మీబాయి (52) కడుపునొప్పితో బాధపడుతూ వెన్నాచేడ్ గ్రామంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. అక్కడ మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందింది. అయితే సదరు ఆర్‌ఎంపీ చికిత్స చేయడం వల్లె మృతి చెందినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. పోలీసులు బుధవారం రాత్రి మహిళ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా గురువారం అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతురాలి కుటుంబసభ్యుల ఆరోపణల నేపథ్యంలో జిల్లా వైద్యశాఖ అధికారులు గురువారం స్పందించారు. జిల్లా మాస్ మీడియా అధికారి మంజుల గ్రామానికి చేరుకొని ప్రైవేటు ఆసుపత్రిని సీజ్ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు ఆసుపత్రిని తెరవొద్దని సూచించారు. ఆమె వెంట మండల మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజ్ గోపాల్ చారితో పాటు మాజీ సర్పంచులు అనంత లక్ష్మారెడ్డి, గోపాల్, పుల్లారెడ్డి ఉన్నారు.

వ్యక్తి బలవన్మరణం

- వివాహేతర సంబంధం నేపథ్యంలో..
- మహిళను కఠినంగా శిక్షించాలని సూసైడ్ నోట్

గద్వాల క్రైం: ఉరేసుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గోనుపాడు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అయిజకు చెందిన వడ్డె శ్రీనివాసులు (45) డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్ల కిత్రం భార్య మృతి చెందాడంతో జీవనోపాధి నిమిత్తం గద్వాల పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో అద్దె ఇంట్లో ఇద్దరు కుమారులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం గోనుపాడు గ్రామంలో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బలవన్మరణానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. రెండు రోజుల క్రింతం మతిస్థిమిత్తం లేని అతని తల్లి గోనుపాడులో ఉంటుందని తెలుసుకుని బుధవారం రాత్రి అక్కడికి వచ్చి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సూసైడ్ నోట్ కలకలం..

మృతుడు వడ్డే శ్రీనివాసులు బలవన్మరణానికి ముందు రాసిన సూసైడ్ నోట్ ఆసక్తికరంగా మారింది. సూసైడ్ నోట్‌లో జిల్లా కేంద్రంలో ఉంటున్న ఓ మహిళతో పరిచయం ఉందని.. ఆ మహిళ మరికొంత మందితో చనువుగా ఉండడంతో తీవ్ర మనోవేధన చెందినట్లు పేర్కొన్నాడు. ఎంతో మంది మగాళ్లను సదరు మహిళ లోబర్చుకుందని నోట్‌లో రాయడం, తన చావుకు ఆ మహిళ కారణమని, ఆమెకు తగిన శిక్ష వేయాలని రాయడం కలకలంగా మారింది. ఈ విషయపై రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్‌ను సాక్షి వివరణ కోరగా.. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చెరువులో మొసలి



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేట గ్రామ సమీపంలోని రామసముద్రం చెరువులో గురువారం ఉదయం మొసలి కనిపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అటు వైపు వెళ్లాలంటేనే రైతులు, పశువుల, గొర్రెల కాపరులు, మత్స్యకారులు భయపడుతున్నారు. వెంటనే ఫారెస్టు అధికారులు స్పందించి మొసలిని ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

శిక్షణతో వృత్తి నైపుణ్యం మెరుగు

ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మన్ననూర్: జర్నలిస్టులు శిక్షణ తరగతులు నిర్వహించుకోవడంతో మరింత పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యం పెంచుకునే అవకాశాలుంటాయని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సూచనప్రాయంగా అన్నారు. గురువారం మన్ననూర్‌లోని అటవీశాఖ వనమాళిక ప్రాంగణంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సంఘం, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిజంలో ఎదురవుతున్న సమస్యలను తట్టుకుని ముందుకెళ్లాలంటే ప్రతి ఒక్కరు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా తమ పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్స్ వాట్సాప్, ఇంస్ట్రాగామ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా ఎక్కడో జరిగిన సంఘటనలు క్షణాల్లో మన ముందు ఉంచుతుందని, అయినప్పటికి ప్రజలు, పాఠకులు వాటి అన్నిటి గురించి ఆలోచించకుండా దేనికి ఇచ్చే ప్రాధాన్యత దానికే ఇస్తున్నారని గుర్తు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమం ములుగు జిల్లాలో ఏర్పాటు చేయాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాలతో నల్లమలలో ఏర్పాటు చేస్తున్నందున ఈ ప్రాంతంలోని జర్నలిస్టులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టులు జ్ఞానం పెంచుకునేందుకు 10 రకాల పుస్తకాల కిట్టును ప్రతి ఒక్కరికి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి మాట్లాడారు. మారుమూల ప్రాంతంలో ఇలాంటి శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్వేత, సంపాదకులు శ్రీనివాస్, విశాలాంధ్ర ఎడిటర్ ఆర్‌వీ రామారావు, దిశ ఎడిటర్ మార్కండేయ, ఐజేయూ జిల్లా నాయకుడు సుదర్శన్ రెడ్డి, జర్నలిస్టులు రాములు, పూర్ణ చంద్రరావు, కర్ణయ్య, శనేశ్వర్‌రెడ్డి, రెహమాన్, సాయిబాబు, శ్రీనివాస్, ప్రభాకర్, లక్ష్మీపతి, బాలస్వామి, వెంకటయ్య, శ్రీధర్‌లతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు సుమారు 90 మంది పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీ పనులు అడ్డుకున్న రైతులు


కాల్వ పనులు అడ్డుకున్న రైతులతో మాట్లాడుతున్న ఎస్‌ఈ రహీముద్దీన్

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన 99వ ప్యాకేజీలోని డీ4 డిస్ట్రిబ్యూటరీ కాల్వ నిర్మాణ పనులను గురువారం రైతులు అడ్డుకున్నారు. మండలంలోని చింతరేవుల గ్రామ శివారులో మొదలైన పనులను భూములను కోల్పోయిన రైతులు అక్కడికి చేరుకుని తమకు తక్కువ పరిహారం ఇచ్చారని, పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే పీజేపీ ఎస్‌ఈ రహీముద్దీన్ అక్కడకి చేరుకుని రైతులతో మాట్లాడారు. గతంలోనే ప్రభుత్వం పరిహారం పూర్తిగా చెల్లించిందని, కలెక్టర్ ఆదేశానుసారం పనులను ప్రారంభించామన్నారు. పనులు అడ్డుకోవడం సమంజసం కాదని రైతులకు నచ్చజెప్పారు. ఈ డిస్ట్రిబ్యూటరీ కాల్వ పనులను వెంటనే పూర్తి చేసి ఆయకట్టుకు సాగు నీరందించాల్సి ఉందని వివరించారు. తద్వారా రైతులకే ప్రయోజనం కలుగుతుందని, నష్ట పరిహారం పొందిన తరువాత కూడా పనులు ఆపడం సమంజసం కాదన్నారు. తమకు రెండు రోజులు గడువు కావాలని రైతులు కోరారు. రెండు రోజుల తరువాత కూడా పనులు అడ్డుకుంటే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ రైతులకు తెలిపారు.

చదువులో అంతరాలు దూరం కావాలి


కోస్గిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నారాయణపేట రూరల్/కోస్గి: ప్రభుత్వ బడులు నిలబడాలని, చదువులో అంతరాలు దూరం కావాలని రాష్ట్ర పౌర స్పందన వేదిక (టీపీఎస్వీ) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత గురువారం జిల్లాలో పర్యటించింది. యూటీఎఫ్, సీఐటీయూ, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు స్వాగతం పలికారు. జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్, సత్యనారాయణ చౌరస్తా, కోస్గిలోని శివాజీ చౌరస్తాలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులతో పాటు అనేక రకాల సౌకర్యాలు ఉన్నాయని.. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్య ఉచితంగా పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలు, వర్క్ బుక్స్, యూనిఫామ్స్ ఉచితంగా అందిస్తున్నారని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వారానికి మూడుసార్లు కోడి గుడ్లు, రాగి జావా అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి పిల్లలను చేర్పించి ఫీజుల భారం నుంచి విముక్తి పొందాలని కోరారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, చదువుల నాణ్యతలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయని వివరించారు. సంపాదనలో సగానికిపైగా పిల్లల చదువుల కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందని.. ప్రభుత్వ బడి మూతబడితే సమాజానికి నష్టమని తెలిపారు. ధార్మిక సంస్థలు ఏర్పాటు చేసిన ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ పాఠశాలలుగా నిర్వహించాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 10 శాతం నిధులు కేటాయించాలని, రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల ఏర్పాటుకు కేంద్రం రూ.ఐదు వేల కోట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేపీ మంగమ్మ, సభ్యులు నాగమణి, కావ్య, ధనమూర్తి, జిల్లా నాయకులు భీమయ్య, శశిరేఖ, వెంకట్‌నాయక్, గోవిందు, మోహన్, మాణిక్యప్ప, సీఐటీయూ నాయకులు వెంకట్రామారెడ్డి, అంజిలయ్యగౌడ్, కాశప్ప, నరహరి, లక్ష్మణ్, ధర్మరాజు, కోస్గిలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివరాములు, నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, శంకర్‌నాయక్, నార్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

రూ.14వేలు జరిమానా

వనపర్తి: వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్న భర్తను ప్రియుడితో కలిసి భార్య అంతమొందించిన కేసులో ఇద్దరికి జీవితఖైదుతో పాటు జరిమానా విధించినట్లు ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ హత్య కేసుకు సంబంధించిన వివారాలు వెల్లడించారు. గోపాల్‌పేట మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన అకునమోని మల్లమ్మ వివాహేతర సంబంధానికి భర్త బాలస్వామిని అడ్డుగా ఉన్నాడని అక్రమ సంబంధం పెట్టుకున్న చింతల వెంటయ్యతో కలిసి రోకలిబండతో తల, శరీర భాగాలపై దాడిచేసి హత్య చేసింది. ఈ క్రమంలో మృతుడి పెద్ద కుమారుడు నరేందర్ గోపాల్‌పేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు నరేందర్ ఫిర్యాదు మేరకు 2021 సంవత్సరంలో గోపాల్‌పేట్ ఎస్‌ఐ రామన్‌గౌడ్ కేసు నమోదు చేయగా అప్పటి వనపర్తి సీఐ ప్రవీణ్‌కుమార్ విచారణ చేపట్టారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ క్రమంలో ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు ప్రస్తుత సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో గురువారం నిందితులను కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోపాల్‌రెడ్డి వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్. సునీత తీర్పు వెల్లడించారు. నేరస్తులు ఆకునమోని మల్లమ్మ, చింతల వెంకటయ్యకు జీవితఖైదుతో పాటు రూ.14వేల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా నేరస్తులకు శిక్ష పడడంలో ప్రతిభ కనబర్చిన అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను ఎస్పీ అభినందించారు. త్వరలో రివార్డు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.